## అదుపు తప్పి ఆటో బోల్తా.. మహిళ మృతి

**నలుగురికి తీవ్రగాయాలు.. మేడారం వెళ్తుండగా ఊరుగొండ వద్ద ఘటన**

దామెర, మే 29 : వరంగల్-భూపాలపట్నం జాతీయ రహదారిపై ఊరుగొండ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన కల్లూరి రాణి (30), ఆమె తల్లి జనరాసుపల్లి లక్ష్మి(68), మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం కొండాపూర్‌కు చెందిన గుళ్ల చిన్నమ్మ (78), కరూర్ గ్రామానికి చెందిన ఊరడి అనంతమ్మ (69) కలిసి శంషాబాద్ వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన సాధుల ప్రభు ఆటోలో మేడారం సమ్మక్క-సారలమ్మ దేవతల దర్శనానికి మంగళవారం రాత్రి బయలు దేరారు. ఊరుగొండ సమీపంలోని ఆర్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఆటో అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనలో జనరాశిపల్లి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, కల్లూరి రాణి, గుళ్ల చిన్నమ్మ, ఊరడి అనంతమ్మ, ఆటోడ్రైవర్ సాధుల ప్రభు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. లక్ష్మి కూతురు కల్లూరి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


బాలరాజు(ఫైల్)

కాశీబుగ్గ, మే 29: నగరంలోని 13వ డివిజన్ ఏకశిలానగర్ రోడ్డుకు చెందిన నార్ల బాలరాజు ఉత్తరాఖండ్ చార్‌ధామ్ యాత్ర పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న క్రమంలో రిషికేష్ వద్ద బ్రేక్ ఫెయిల్ అయి వ్యాన్ లోయలో పడింది. ఈ ఘటనలో బాలరాజు మృతి చెందగా, ఆయన సతీమణికి గాయాలయ్యాయి. దీంతో ఏకశిలానగర్‌లో విషాదఛాయలు ఏర్పడ్డాయి.

## కేఎంసీకి పార్థివదేహం అప్పగింత


ఎల్లగౌడ్(ఫైల్)

సంగెం, మే 29 : ఎల్గూర్‌రంగంపేట గ్రామానికి చెందిన ఎంసీపీఐ(యూ) సీనియర్ నాయకుడు నారగోని ఎల్లగౌడ్(90) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా, కుటుంబ సభ్యులు ఆయన పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఎల్లాగౌడ్ తాను మృతిచెందిన తర్వాత భౌతిక కాయాన్ని కేఎంసీకి ఇస్తానని రాసి ఇచ్చాడు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఎల్లగౌడ్ మృతదేహాన్ని కేఎంసీకి తరలించారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, మే 29 : కాజీపేట రైల్వే స్టేషన్ శివారులోని అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలోని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, 5'7 ఎత్తు, వైట్ జీన్స్, తెలుపు రంగు గీతల ఫుల్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఎడమ చేతిపై HH అని పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామన్నారు. సంబంధికులుంటే కాజీపేట జీఆర్పీ లేదా 87126 58609లో సంప్రదించాలని కోరారు.

## ఉరేసుకొని యువకుడు..


నరేశ్ (ఫైల్)

కాశీబుగ్గ, మే 29 : సూర్జిత్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం నరేశ్ (34) అనారోగ్యం బాధపడున్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ జంక్షన్‌లో వ్యక్తి మృతి

కాశీబుగ్గ, మే 29 : నగరంలోని 18వ డివిజన్ నర్సంపేట రోడ్డులోని తెలంగాణ జంక్షన్‌లో బుధవారం రాత్రి ఒకరు మృతి చెందాడు. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఆర్‌తోటకు చెందిన పెసర రాకేశ్(40) మద్యానికి బానిసై తెలంగాణ జంక్షన్‌లో రోడ్డుపై మృతిచెంది ఉండగా, స్థానికులు 108కు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

కాశీబుగ్గ, మే 29 : రక్తదానం ప్రాణదానంతో సమానమని కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి పేర్కొన్నారు. బుధవారం గోపాలస్వామి గుడి తోట మైదానం అసోసియేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత పిల్లల కోసం రెడ్ క్రాస్ సొసైటీ సమక్షంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, గోపాలస్వామి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాశ్, వెంకటేశ్వర్లు, సాంబయ్య, కుమారస్వామి, అంజయ్య, ప్రభాకర్, రాజేశం, రాము, సురేశ్, రాము, రోజు, భాస్కర్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

# పోషణ లోపంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జూన్ 30లోగా సర్వే పూర్తి చేయాలి
- ఐసీడీఎస్ సెక్రటరీ వాకాటి కరుణ
- అంగన్‌వాడీ సెంటర్ సందర్శన


హనుమకొండ : అంగన్‌వాడీ సెంటర్‌లో వివరాలు అడుగుతున్న వాకాటి కరుణ

హనుమకొండ, మే 29 : అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే చిన్నారులు, పిల్లల్లో పోషణలోపంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ వాకాటి కరుణ అన్నారు. బుధవారం వడ్డేపల్లి సెక్టార్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. లబ్ధిదారుల కుటుంబ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారం, గ్రోత్ కార్డులపై తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. సెంటర్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌జేడీ ఝాన్సీలక్ష్మీబాయి, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, సూపర్‌వైజర్స్ కవిత, రాజ్యలక్ష్మి, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి, అంగన్‌వాడీ టీచర్స్ సరస్వతి, సునీత, ఆయా స్వప్న పాల్గొన్నారు.

**భద్రకాళీని దర్శించుకున్న కరుణ**

వరంగల్ : వాకాటి కరుణ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు శేషు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మహా మండపంలో ఆశీర్వచనం జరిపి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి, ప్రసాదం అందజేశారు.

**వేయిస్తంభాల ఆలయంలో..**

హనుమకొండ చౌరస్తా : చారిత్రక వేయిస్తంభాల దేవాలయాన్ని వాకాటి కరుణ సందర్శించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆధ్యాత్మిక వేత్త పురాణపండ శ్రీనివాస్ రచించిన 'శ్రీ మాలిక' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈవో వెంకటయ్య పాల్గొన్నారు.

**కేయూ విద్యార్థుల వినతి**

కాకతీయ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో పద్మాక్షి గర్ల్స్ హాస్టల్‌లోకి కుక్కలు, పాములు, ఎలుకలు వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు ఫిర్యాదు చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సుధీర్‌కుమార్

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

**మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్**

ఎల్కతుర్తి, మే 29 : బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దామెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జయపాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా, పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా కింద మంజూరైన రూ. 2లక్షలను అతడి భార్య లక్ష్మికి మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి ప్రధాన బలమని, వారి బాగోగుల కోసం మాజీ సీఎం కేసీఆర్ అన్ని విధాలా ఆలోచించి ప్రమాద బీమా పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ మేకల స్వప్న, మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, సొసైటీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు తంగెడ మహేందర్, కడారి రాజు, గొల్లె మహేందర్ పాల్గొన్నారు.

## సొంత వాహనాలకు అద్దె చెల్లించం

**గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**

వరంగల్, మే 29 : కార్పొరేషన్‌లో కొంత మంది అధికారులు సొంత వాహనాలు వాడుకుంటూ అద్దె తీసుకుంటున్న వారికి కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే చెక్ పెట్టారు. ట్యాక్స్ ప్లేట్ వాహనాలకు మాత్రమే బిల్లులు చెల్లించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. చాలామంది అధికారులు కొన్నేళ్లుగా సొంత వాహనాలు వాడుకుంటూ బల్దియా నుంచి ప్రతి నెలా బిల్లులు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మూడు నెలలకు ఆర్టీఏకు చెల్లించే ట్యాక్స్ డాక్యుమెంట్లు ఉన్న వాహనానికి మాత్రమే బిల్లులు చెల్లించాలని ఆదేశాలు ఇవ్వడం కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

## ప్లాస్టిక్ దుకాణాల్లో తనిఖీలు

వరంగల్, మే 29 : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు విక్రయించే దుకాణాల్లో బల్దియా, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేశారు. బుధవారం బట్టలబజార్, పిన్నావారి వీధిలోని షణ్ముక, హనుమాన్, సుధా, హరి ఓం, లేపాక్షి, ఉత్తమ్, భవానీ షాపుల్లో తనిఖీలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పలు షాపులకు జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డి, పీసీబీ సిబ్బంది సుభాశ్, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, కొడిమ్యాల శ్రీనివాస్‌రావు, వసంత, సారంగం, ప్రభాకర్, శ్రీనివాస్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ చౌరస్తా, మే 29 : వరంగల్-1 డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 26047లో సంప్రదించాలని కోరారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

## దీర్ఘకాలిక పంటలపై శిక్షణ

కాశీబుగ్గ, మే 29 : పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం దీర్ఘకాల పంట, నేల ఆరోగ్య పరిరక్షణపై 50 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఆర్ ఉమారెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకొని ఎరువులను వినియోగించాలని సూచించారు. డాక్టర్లు దిలీప్‌కుమార్, నగేశ్ కుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి


పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ, మే 29: అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పీ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం వరంగల్ మండలంలోని మట్టేవాడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, గ్రెయిన్ మార్కెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఏనుమాముల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, క్రిస్టియన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, సుందరీకరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎంపికైన 459 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే అభివృద్ధి పనులు కొన్ని పూర్తయ్యాయని, ఇంకా కొన్ని పాఠశాలలో పెయింటింగ్, డ్యూయల్ డెస్కులు, త్వరగా గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేసేలా ప్రత్యేకాధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, మెప్మా డీఎంసీ రేణుక, ఈఈ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు, ఎంఈవోలు, ఎంఎన్‌వో, టీఎల్ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

- లోక్‌సభ ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి
- సీపీ అంబర్ కిశోర్ ఝా


పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

సుబేదారి, మే 29 : నిజాయితీగా విధులు నిర్వర్తించి బాధితులకు న్యాయం చేయాలని, పోలీసు ప్రతిష్ఠను దిగజార్చే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను హెచ్చరించారు. బుధవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 4న ఎనుమాముల మార్కెట్‌లో నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలపై నిఘా పెట్టి, విక్రయించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శాంతిభద్రల విషయంలో ప్రజలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని, స్పదించకుంటే 8712685070 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం లోక్‌సభ, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సాఫీగా నిర్వహించడానికి కృషి చేసిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో డీసీపీలు అబ్దుల్ బారి, రవీందర్, ఏఎస్పీ అంకిత్ పాల్గొన్నారు.

# కేయూ-పెద్దమ్మగడ్డ రోడ్డులో ట్రాఫిక్ జామ్


హనుమాన్‌నగర్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

సుబేదారి, మే 29 : హనుమకొండలోని పెద్దమ్మగడ్డ-కేయూసీ హనుమాన్‌నగర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ గంటన్నర పాటు నిలిచి పోయింది. నయీంనగర్ మోరీ నిర్మాణంతో కేయూసీ రోడ్డులో వెళ్లే వాహనాలను ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ ద్వారా దారి మళ్లించారు. దీంతో బుధవారం కేయూసీ రోడ్డులోని హనుమాన్ నగర్ బ్రిడ్జి వద్ద వాహనాల రాకపోకాలకు తీవ్ర అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులే క్లియర్ చేశారు.

## బాధితులకు నన్నపునేని పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

కాశీబుగ్గ, మే 29 : నగరంలోని 21వ డివిజన్ లోతుకుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొత్తురు సంపత్ బుధవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. సంపత్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ తరుపున అండగా నిలుస్తానని భరోసా కల్పించి, ఆర్థిక సాయం చేశారు. అలాగే, కాశీబుగ్గకు చెందిన వ్యాపారవేత్త వెంకట్ కుమారుడు చెన్నకేశవులు రైలు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని కూడా పరామర్శించారు.

## మెరుగైన విద్యుత్ సరఫరా

**గత ఏడాదితో పోల్చుకుంటే తగ్గిన ట్రిప్పింగ్స్**

**ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి**


సీఎండీ వరుణ్‌రెడ్డి

సబర్బన్, మే 29 : ఎన్పీడీసీఎల్ పరిధిలోని 569 ఫీడర్లలో (ఆర్‌టీడీఏఎస్ ప్లస్ ఎస్‌సీఏడీఏ) గతేడాది జనవరి నుంచి మే వరకు 11కేవీ ట్రిప్పింగ్స్ 57,771 ఉండగా, ఈ ఏడాది 40,724 నమోదయ్యాయని, గతంతో పోల్చుకుంటే 17,047 తగ్గాయని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. 29.51% తగ్గిందని, అలాగే గతేడాది జనవరి నుంచి మే వరకు 10,558 గంటల అంతరాయాలు ఉండగా ఈ ఏడాది 7,262 గంటలు నమోదైందని, 3,296 గంటల అంతరాయాల సమయాన్ని తగ్గించగలిగామని చెప్పారు. 31.22 శాతం తగ్గిందన్నారు. ప్రీ మాన్‌సూన్ ఇన్‌స్పెక్షన్, సుమారు 200 ఫీడర్లపై కెపాసిటర్ బ్యాంకులను అమర్చడం, 530 ఫీడర్లలో పవర్ ఫ్యాక్టర్ నిర్వహించడం వల్ల సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, ఇక ముందు కూడా అందిస్తామని వరుణ్‌రెడ్డి తెలిపారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

హనుమకొండ, మే 29 : గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా చూడాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు వైద్య సేవల కోసం 14416 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఎంజీఎం దవాఖానలో 20 బెడ్లతో రిహాబిలిటేషన్ సెంటర్ అందుబాటులో ఉందని, బాధితులకు 30 రోజులపాటు ఉచిత వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. మత్తు పదార్థాల నియంత్రణకు 7013036629 సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి పాల్గొన్నారు.

## చేనేత సంఘాల్లో కార్పెట్ల కొనుగోళ్లు ప్రారంభం

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**


బెడ్‌షీట్లపై స్టాంప్ వేస్తున్న అధికారులు

కాశీబుగ్గ, మే 29: వరంగల్ జిల్లాలోని చేనేత సహకార సంఘాల నుంచి నేత ఉత్పత్తులను టెస్కో అధికారులు కొనుగోళ్లను బుధవారం ప్రారంభించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈ నెల 16న 'కొనుగోళ్ల కోసం ఎదురు చూపు' అనే శీర్షిక ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి చేనేత సంఘాల్లో నిల్వ ఉన్న బెడ్‌షీట్లు, కార్పెట్లు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని సంఘాలల్లో నిల్వ ఉన్న బెడ్‌షీట్లకు స్టాంపింగ్ వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో 28 చేనేత సహకార సంఘాలు, 35 మ్యాక్స్ సంఘాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతానికి లక్షా 40 వేలు కార్పెట్లను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మిగితా బెడ్ షీట్లను తొందర్లోనే కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాఘవరావు, టెస్కో డీఎం కృష్ణ హరి పాల్గొన్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

కాశీబుగ్గ, మే 29 : వరంగల్ ఎంజీఎం దవాఖానలో మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. దవాఖానకు చికిత్స కోసం వచ్చిన మహిళకు వేడి నీళ్లు ఇస్తానని మాయమాటలు చెప్పి మరో మహిళ ఆమె బంగారు గొలుసును దొంగిలించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముగిసిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

నర్సంపేట రూరల్, మే 29 : మండలంలోని ముగ్ధుంపురం గ్రామ శివారు జయముఖి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ కంపెనీ థాట్‌వర్క్ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌కు 200 మంది విద్యార్థులు హాజరు కాగా, 54 మంది విద్యార్థులు ప్రతిభ చూపి ఎంపికయ్యారని కంపెనీ హెచ్ఆర్ కౌషిక్, కళాశాల ట్రెజరర్ శంకర్‌రెడ్డి తెలిపారు. వారికి మూడు అంచెల పద్ధతిలో భాగంగా ఆన్‌లైన్ పరీక్ష, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జానకి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, డైరెక్టర్ వాహినిదేవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

**WANTED**

jobs Apply Now!

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565


సమావేశంలో మాట్లాడుతున్న రజినీకుమార్

## ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

హసన్‌పర్తి, మే 29 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండి రజినీకుమార్ కార్యకర్తలను పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించాలని చెప్పారు. జూన్ 1న అమరవీరులకు పుష్పాంజలి, కొవ్వత్తుల ర్యాలీ, 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, 3వ తేదీన ప్రతి గ్రామంలో పార్టీ జెండాలు ఎగరేయాలని కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 66 డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు రవి, శ్రావణ్, యుగేంధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్మిక నాయకుడు నాయిని రవి

## కార్మిక సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు

హనుమకొండ, మే 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ అనుబంధ ట్రేడ్ యూనియన్ నాయకుడు నాయిని రవి అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఏటా మే నెలంతా కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్మిక మాసోత్సవం నిర్వహిస్తున్నారని, ఈసారి ఎన్నికల కోడ్ ఉన్నందున నిర్వహించలేక పోయామని తెలిపారు. గురువారం కార్మిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం, శుక్రవారం కార్మికులు, నాయకులతో కలిసి సమావేశం నిర్వహిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కార్మిక మంత్రిని నియమించకపోవడం శోచనీయమని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ హాస్పిటల్స్ నిర్వహణలో జాప్యం, మందులు, వైద్య పరికరాల కొరతను నివారించాలన్నారు. సమావేశంలో కేశోజు ప్రణయ్, రవీందర్ రెడ్డి, సాయిని రవి, సంజీవ్, చాగంటి రమేశ్, కుసుమ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## 'నకిలీ విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి'

నర్సంపేట, మే 29 : నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీవోకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలపై 75 శాతం సబ్సిడీ ఇవ్వాలని, రూ.2 లక్షల రుణ మాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, దయాకర్, కృష్ణ, తిరుపతి, సారంగపాణి, పూలక్క, హరిబాబు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని గద్దె దింపడం ఖాయం

- ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం చేసిన కాంగ్రెస్
- జూన్ 11లోగా రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హనుమకొండ, మే 29 : ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని రాబోయే రోజుల్లో గద్దె దింపడం ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆయన మాట్లాడారు. జూన్ 11వ తేదీలోగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో రిజర్వేషన్ పెంపుదలపై నిర్లక్ష్యమే నిదర్శనమన్నారు. ఆయా వర్గాలను నమ్మించేందుకు అదే వర్గానికి చెందిన పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను చేవెళ్లకు తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ పెంచుతున్నట్లు డిక్లరేషన్ చేయించారన్నారు. అలాగే బీసీ వర్గానికి చెందిన కర్ణాటక ప్రస్తుత సీఎం సిద్ధరామయ్యను కామారెడ్డికి తీసుకొచ్చి ఆయనతో బీసీ డిక్లరేషన్ చేయించారన్నారు. రాష్ట్రాల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచుకొనే వెసలుబాటు ఉందని రాజ్యాంగం చెబుతున్నా సీఎం ఆ దిశగా ప్రయత్నించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను మోసం చేసి, మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ పెంపుపై సీఎం నిర్ణయం తీసుకోకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, మంద కుమార్, జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేశ్ పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రాయపర్తి/కరీమాబాద్, మే 27 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జేడీఏ ఉషాదయాళ్ అన్నారు. బుధవారం మండలంలోని రాయపర్తి, కొండూరు, మైలారం, మహబూబ్‌నగర్, పెరికేడు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసేప్పుడు రశీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ సారంగం, సీహెచ్ కృష్ణారెడ్డి, ఏవో వీరభద్రం, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు. అలాగే, ఖిలా వరంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని జేడీఏ ఉషాదయాళ్ సందర్శించారు. రైతులు ఒకే రకమైన విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏవో విజ్ఞాన్, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, వ్యవసాయ అధికారులు కృష్ణారెడ్డి, సారంగం, సిబ్బంది పాల్గొన్నారు.

**రైతులకు అందుబాటులో విత్తనాలు**

ఆత్మకూరు : రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయని, ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ అన్నారు. బుధవారం పెంచికల్‌పేట ప్రాథమిక సహకార సంఘం విత్తన గోదామును ఆయన తనిఖీ చేశారు. జీలుగ విత్తనాల అమ్మకాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. 60 శాతం సబ్సిడీతో జీలుగ, జినుము విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. పత్తి విత్తనాలను జిల్లాకు 2,50,410 ప్యాకెట్లు తెప్పించామన్నారు. 1,18,790 ప్యాకెట్లు విక్రయించామని, ఇంకా 1,69,630 ప్యాకెట్లు ఉన్నాయన్నారు. అన్ని BT2 పత్తి విత్తనాల్లో గులాబీ రంగు పురుగును తట్టుకునే ఒక రకమైన ప్రొటీన్ ఉంటుందన్నారు. రైతులు సీల్డ్ ప్యాకెట్‌లో ఉన్న విత్తనాలను మాత్రమే కొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో మానస పాల్గొన్నారు.


మైలారంలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఉషాదయాళ్


పెంచికలపేట సొసైటీని తనిఖీ చేస్తున్న రవీందర్‌సింగ్